www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 సెప్టెంబరు 2024



గట్ల పటిష్టతపై పర్యవేక్షించాలి : జెసి

భీమవరం: డ్రెయిన్లు, కాలువ గట్ల పటిష్టతపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రెండు రోజులు క్రితం కురిసిన వర్షాల కారణంగా పొంచి ఉన్న ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం ఆయన తాడేపల్లిగూడెం సమీపాన ఉన్న నందమూరి అక్విడెక్ట్, ఎర్రకాలువ, భీమవరం పట్టణంలోని బైపాస్ వద్ద యనమదుర్రు డ్రెయిన్, మెంటేపూడి తోట ప్రాంతాల్లో పర్యటించి వరద నీటిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతానికి వరద నీటిమట్టం తగ్గుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు గట్ల పటిష్టతపై తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. రానున్న నాలుగు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తత అవసరమని అధికారులకు సూచించారు. ఆయన వెంట గోదావరి వెస్ట్రన్ డివిజన్ నిడదవోలు ఇఇ ఎం.దక్షిణామూర్తి, ఇరిగేషన్ డిఇలు సత్యదేవ్, ఎ.రవీంద్రబాబు, ఎఇ వెంకటేశ్వరరావు, జెఇలు కిరణ్, పెద్దిరెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఉన్నారు.

రైతు కష్టం.. నీటి పాలు..!



నూజివీడు బైపాస్ రోడ్డులో వరద ఉధృతికి దెబ్బతిన్న పొలం

అన్నదాతకు దెబ్బమీద దెబ్బ

ప్రస్తుత ఖరీఫ్‌లో రెండుసార్లు విరుచుకుపడిన విపత్తులు

జులై వరదలకు రెండు జిల్లాల్లో రూ.11 కోట్ల వరకూ పంటనష్టం

ప్రస్తుత వర్షాలకు 14 వేల ఎకరాల్లో పంట ముంపులోనే

నూజివీడు డివిజన్‌లోనే ఆరు వేల ఎకరాల్లో పంటకు ముప్పు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత కష్టం వరదల పాలవుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నదాతకు దెబ్బమీద దెబ్బ అన్నట్లు పరిస్థితి తయారైంది. ఇప్పటికే రెండుసార్లు భారీవర్షాలు, వరదలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వేలాది ఎకరాల్లో పంట నష్టపోయిన అన్నదాత కోలుకోలేని స్థితిలోకి కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న పంటనష్టం లెక్కలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో రెండు రోజులపాటు జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం ఆగడంతో జిల్లా ప్రజానీకం కొంత ఊపిరి పీల్చుకున్నా ఆకాశం మేఘావృతమై ఉండటంతో లోలోన భయాందోళనకు గురవుతోంది. జులైలో విరుచుకుపడిన గోదావరి వరదలు, భారీ వర్షాలకు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున నాట్లు, నారుమడులు నీట మునిగాయి. రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. నాట్లు నాటి 30 రోజులు దాటితేనే నష్టం కింద నమోదు చేయడంతో వేలాది మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటనష్టం నమోదు చేసిన అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 13 వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నట్లు తేల్చారు. రైతులకు పంట నష్టపరిహారం కింద రూ.పది కోట్లు ఇవ్వాల్సి ఉందని జిల్లా వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఏలూరు జిల్లాలో దాదాపు 400 ఎకరాల వరకూ పంటనష్టం వాటిల్లిందని, రూ.కోటి వరకూ పరిహారం కింద రైతులకు అందించాలని తేల్చారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారం ఇంకా రైతులకు అందనే లేదు. మరోసారి వరదలు, వర్షాలు విరుచుకుపడ్డాయి. దీంతో మరోసారి పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి.

రెండు జిల్లాల్లో 14 వేల ఎకరాల్లో పంట ముంపులోనే

అల్పపీడన ప్రభావంతో రెండు రోజులపాటు రెండు జిల్లాలను వర్షాలు ముంచెత్తాయి. దీంతో నూజివీడులో పెద్దచెరువుకు గండిపడి చుట్టుపక్కల ప్రాంతాలు, పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. పెదపాడు, ఆగిరిపల్లి, చాట్రాయితోపాటు పలు మండలాల్లో వరి పంట దెబ్బతింది. ఏలూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురైంది. దానిలో వరి పంట 9,950 ఎకరాలు ఉండగా, మినుము 1,585 ఎకరాల్లోనూ, మొక్కజొన్న, చెరకు, పెసలు, పత్తి, వేరుశనగ వెయ్యి ఎకరాల్లో ఉన్నాయి. ఒక్క నూజివీడు డివిజన్‌లోనే వరి పంట ఆరు వేల ఎకరాల్లో ముంపులో ఉన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనాల్లో తేల్చారు. వర్షాలకు పశ్చిమగోదావరి జిల్లాలో 2,120 ఎకరాల్లో వరిపంట ముంపులో ఉన్నట్లు ప్రాథమిక అంచనాలో తేల్చారు. పూర్తిస్థాయిలో దెబ్బతిన్న పంటలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. 30 శాతంలోపు దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. జులైలో కురిసిన వర్షాలకు నారుమడులు దెబ్బతినడంతో ఆగస్టు గడిచినా ఇంకా ఖరీఫ్ నాట్లు పూర్తి కాలేదు. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవ్వగా ఇంకా పదిశాతం నాట్లు వేయాల్సి ఉంది. వరుస విపత్తులతో రైతులు విలవిల్లాడుతున్నారు. తమ్మిలేరు, బుడమేరు, రామిలేరు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో కొల్లేరులో వరద నీరు పోటెత్తే పరిస్థితి ఏర్పడింది. దీంతో కొల్లేరును ఆనుకుని ఉన్న కైకలూరు, ఉండి, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

వరద తగ్గుముఖం

అల్పపీడన ప్రభావంతో గడిచిన శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ్మిలేరు పొంగిపొర్లడంతో శనివారపుపేట కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేశారు. వరద నీరు తగ్గకపోవడంతో సోమవారం రాత్రికి కూడా రాకపోకలు పునరుద్ధరించలేదు. రామిలేరు పొంగి పెదపాడు మండలంలో అప్పనవీడు ప్రాంతాన్ని ముంచెత్తింది. జాతీయ రహదారిపై సైతం మోకాళ్లలోతు నీరు పారింది. వరద నీరు తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నూజివీడులో పెదచెరువుకు గండిపడి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరదనీరు తగ్గి పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోవడంతో అక్కడి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కొల్లేరులో వరద ఉధృతి తగ్గి ముంపులోంచి పంట పొలాలు బయటపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆది, సోమవారాల్లో పెద్దగా వర్షం కురవకపోవడంతో పరిస్థితి కొంత మెరుగ్గా కనిపిస్తోంది.

విజయవాడ వరద బాధితులకు పశ్చిమ సాయం

జిల్లా నుంచి 80 వేల ఆహార పొట్లాలు సరఫరా

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



విజయవాడ తరలించేందుకు సిద్ధం చేసిన ఆహార పొట్లాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

విజయవాడలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వరద బాధితులకు పశ్చిమగోదావరి జిల్లా చేయూతనిచ్చింది. విజయవాడకు జిల్లా నుంచి 80 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ పంపించారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ మీదుగా ప్రవహిస్తున్న బుడమేరు వెటిగట్టు ఆకస్మికంగా తెగిపోవడంతో అజిత్‌సింగ్ నగర్, నున్న, వాంబే కాలనీ, జక్కంపూడి, కండ్రిక, దేవీనగర్, అంబాపురం ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. ఆయా ప్రాంతాల ప్రజలు వరద నీటిలో చిక్కుకుపోయారు. ప్రస్తుతం ఆ బాధితులకు ఆహార పొట్లాలను బోట్లు, హెలికాప్టర్ల ద్వారా అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా వరద బాధితులకు ఆపన్న హస్తం అందించింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలతో జిల్లాలోని 15 ప్రాంతాల్లో 80 వేల ఆహార పొట్లాలను సిద్ధం చేసి సోమవారం విజయవాడ పంపారు. భీమవరం విష్ణు కళాశాల, ప్రయివేట్ హోటల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను, ప్యాకింగ్, రవాణాను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంల్లోని 15 ప్రాంతాల్లో ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు చెప్పారు. 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్, వాటర్ ప్యాకెట్లు 50 వేల చొప్పున, 1,14,500 బిస్కెట్ ప్యాకెట్లను 14 వాహనాల్లో విజయవాడ పంపినట్లు తెలిపారు. అలాగే సాయంత్రం మరో 30 వేల ఆహార పొట్లాలను పంపినట్లు వివరించారు. భారతీయ విద్యా భవన్ గోదావరి విద్య వికాస్ చైతన్య సొసైటీ, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజ్, తాడేపల్లిగూడెం రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఉద్యాన యూనివర్సిటీ, నిట్, వాసవి ఇంజినీరింగ్ కాలేజ్, శశి ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం విష్ణు కాలేజీల సహాయ సహకారాలతో ఆహార పదార్థాలను తయారు చేసి అందించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మరిన్ని ఆహార పొట్లాలను సరఫరా చేయాల్సి వస్తే అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట భీమవరం తహశీల్దార్ రావి రాంబాబు ఉన్నారు.

తాడేపల్లిగూడెం: విజయవాడ వరద బాధితులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిట్ బాలుర హాస్టల్ సిబ్బంది రాత్రంతా కష్టపడి మొత్తం 2,330 ఆహార పొట్లాలను సిద్ధం చేశారు. తాడేపల్లిగూడెం రెవెన్యూ అధికారుల సహాయంతో విజయవాడలోని వరద బాధితులకు పంపించారు. ఈ సందర్భంగా డైరెక్టర్, రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుతో ముంపునకు గురైన పలు ప్రాంతాల ప్రజానీకానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో 2,330 ఆహార పొట్లాలను సిద్ధం చేసి విజయవాడకు పంపించామని తెలిపారు.

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు సుమారు 11 వేల ఆహార పొట్లాలు, లక్ష బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను వరద పంపినట్లు తాడేపల్లిగూడెం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తెలిపారు. తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ శివన్నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 50 మంది మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని తరలించినట్లు తెలిపారు.

మెడిసిన్స్ తరలింపు

నరసాపురం: తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు ఆదేశాల మేరకు నరసాపురం మెడికల్ అసోసియేషన్ నుండి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.50 వేల విలువైన 500 మెడికల్ కిట్స్ పంపించినట్లు నరసాపురం మెడికల్ అసోసియేషన్ నేత చెన్నంశెట్టి నాగు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కామిశెట్టి నాగబాబు, ట్రెజరరీ జి.సూరిబాబు, అంజనా సత్తిబాబు పాల్గొన్నారు.

భీమవరంలో పవన్ డయాలసిస్ సెంటర్

60 ఎకరాల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటు

మార్చిలో టిడ్కో ఇళ్లు పంపిణీ

భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని మూడో అంతస్తులో నూతన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించనున్నామని, నెల రోజుల్లోనే పూర్తి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ డయాలసిస్ సెంటర్‌కు పవన్‌కళ్యాణ్ పేరు పెట్టి నెలరోజుల్లో ప్రారంభిస్తామని, ఉచితంగా వైద్యసేవలను అందిస్తామని తెలిపారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అవసరమైన ఫీజులు దాతల సహకారంతో అందిస్తామని, ఇటీవలే 10 మంది విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున దాతల సహకారంతో అందించామని వివరించారు. జిల్లా కలెక్టరేట్ స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తామన్న జిఒను రద్దు చేసి 60 ఎకరాలు సేకరించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌తో చర్చించి ఈ 60 ఎకరాలను సేకరిస్తామన్నారు. భీమవరం, వీరవాసరం మండలాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని, ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. వీరవాసరంలో 23, భీమవరంలోని 25 గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. పిహెచ్‌సిలను అభివృద్ధి చేస్తామని, లోఓల్టేజీ సమస్య లేకుండా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌లు వేయిస్తామన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి టిడ్కో ఇళ్లు అందిస్తామని తెలిపారు. భీమవరం మున్సిపాల్టీకి చెందిన 50 ఎకరాల రెండు చెరువులు ఉన్నాయని, వాటి పక్కన మరో 60 ఎకరాలను సేకరిస్తే ఆ భూమిని గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు ఇచ్చి తప్పు చేసిందన్నారు. తాగునీటి చెరువు కోసం రూ.46 కోట్లు మంజూరయ్యాయన్నారు. భీమవరం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పట్టణాధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, సుంకర రవి, వానపల్లి సూరిబాబు, కారుమూరి సత్యనారాయణమూర్తి, భీమాల శ్రీరామ్మూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం



బాలేపల్లి లో మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం బందం

భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాల రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. మండలంలో నీట మునిగిన పంట పొలాలను సిపిఎం బృందం సోమవారం పరిశీలించింది. వీరవాసరం, మెంటేపూడి, బాలేపల్లి, నందమూరి గురువు, మత్స్యపురిపాలెం, పెరికిపాలెం గ్రామాల్లో నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎకరాకు రూ.25 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి అధికారులు తక్షణమే గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వేసి పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు యాళ్లబండి నారాయణమూర్తి, గొట్టుముక్కల శ్యాంబాబు, రెడ్డి రామారావు, బి.విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనశ్రేణులు, వీర మహిళలు, చిరు, పవన్ యూత్, ఎన్‌డిఎ కూటమి సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్‌ను ఎంఎల్ఎ కట్‌చేశారు. అనంతరం పట్టణంలో జనశ్రేణులు ఏర్పాటు చేసిన ద్విచక్ర ర్యాలీని ప్రారంభించారు. బుల్లెట్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ నాయకర్ ప్రదర్శన చేశారు. పంజా సెంటర్, పాతబజార్, గాంధీ సెంటర్, కోటిపల్లి వారివీధి, పూల సెంటర్, అంబేద్కర్ సెంటర్, శ్రీహరిపేట, లాకుపేట, జక్కంవారివీధి, రాయపేట, రుస్తుంబాద, సీతారామపురం, వైఎస్.పాలెం, తూర్పుతాళ్లు, కొప్పర్రు, లిఖితపూడి, మల్లవరం, సరిపల్లి, ఎల్‌బి.చర్ల, చామకూరి పాలెం ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. పలు ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా క్లీన్ ఆంధ్రా, గ్రీన్ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించి వీధులను శుభ్రం చేశారు. చిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద వీర మహిళల ఆధ్వర్యంలో పేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భీమవరం టౌన్ : జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎ అంజిబాబు నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఎల్ఎ చేతులమీదుగా కేక్‌కట్ చేసి జనసేన నాయకులు భీమాల శ్రీరామ్మూర్తి సౌజన్యంతో 27వ వార్డుకు చెందిన వికలాంగురాలు కొక్కిరి నాగమణికి ఎంఎల్ఎ చేతుల మీదుగా ట్రై సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఇర్రింకి సూర్యారావు, జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

తణుకు : పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగాతణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లోని పలు గ్రామాల్లో, తణుకు పట్టణంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమం చేపట్టి ప్రతి గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి, అక్కడ నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, మహిళలు, ఇతర నాయకులు పాల్గొన్నారు

మీ వెంట మేముంటాం

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

'మీ వెంట మేముంటాం. అధైర్య పడొద్దు' అంటూ అయిభీమవరం రోడ్డు కార్మికనగర్ వాసులకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ భరోసా ఇచ్చారు. స్థానిక అయిభీమవరం రోడ్డు కార్మిక నగర్ ప్రజల ఇళ్లను తొలగిస్తారన్న నేపథ్యంలో సిపిఎం నేతలు సోమవారం అక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు ఖాళీ చేయాలనడం, విఆర్‌ఒలు కొలతలు వేయటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కార్మిక నగర్ ప్రజలు కనీసం 70, 80 ఏళ్ల నుండి ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్నారన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపి కనీసం ఒక సంవత్సరం గడువు ఇవ్వాలని కోరారు. దీనికి ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి, బివి.వర్మ బి.రాంబాబు, సందక సూరిబాబు, గేదెల ధనుష్, ఎర్ర కృష్ణవేణి, లింగాల బలరాం, ప్రసాద్, ఏసు, సావిత్రి, దుర్గారావు, సావిత్రి, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో కెలంక ఛానల్ పరిధిలో నీట మునిగిన వరి పొలాలను, పంట కాలువ గట్ల పరిస్థితిని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. కాళ్లలో వరి చేలు పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, రైతులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కెలంక ఛానల్‌లో నాలుగుచోట్ల గట్లు బలహీనంగా ఉన్నాయన్నారు. గట్లు పటిష్టపరచాలని ఇరిగేషన్ శాఖాధికారులకు సూచించామన్నారు. రైతులు ఆయిల్ ఇంజిన్లతో నీటిని బయటికి తోడు కావాలన్నారు. డీజిల్ ఖర్చులు కలెక్టర్ నిధుల నుండి ఇస్తామన్నారు. విఆర్‌ఒలు డీజిల్ కూపన్లు ఇస్తారని తెలిపారు. ఆయన వెంట ఆకివీడు ఎడిఎ కెఎస్ఎస్.శ్రీనివాస్, ఎఒ జయ వాసుకి, ఉండి కెవికె కోఆర్డినేటర్ మల్లికార్జునరావు, మార్టేరు వరిపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు వై.సునీత, ఆర్ఎఆర్ఎస్.రజిత పాల్గొన్నారు.

ఆకివీడు: పంటచేలల్లో నిలిచిన నీటిని వెంటనే బయటికి పంపించే ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన కుప్పనపూడి, అజ్జమూరు గ్రామ పంట భూములను పరిశీలించారు. ఎఒ ప్రియాంక, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరవాసరం : బాదేపల్లిలో నీట మునిగిన పంట పొలాలను ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారిని బిన్సీ బాబు ఇతర రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. బాలేపల్లిలో తొక్కోడు, కరకోడు లంక ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల వరకూ ముంపునకు గురైందని రైతులు వారి దృష్టికి తెచ్చారు. ఈ ముంపునకు ప్రధాన కారణం మత్స్యపురి వద్ద తొక్కోడుపై ఉన్న తూరల వంతెన ప్రధాన కారణమని తెలిపారు. ఈ తూరల స్థానంలో వంతెన నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ ఇంతవరకూ పట్టించుకోలేదని రైతులు వాపోయారు. ఎంఎల్ఎలు మారుతున్నారు తప్ప తూరల వంతెన వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యను మాత్రం పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం తొక్కోడు మురుగు కాలువను ప్రక్షాళన చేయాలని లేని పక్షంలో దాళ్వా కూడా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ ఎఇ మాట్లాడుతూ ప్రస్తుతం అమావాస్య పోటు ఉందని దీనివల్ల గొంతేరు మురుగు కాలువ ఎగ దన్నుతోందని తెలిపారు. మరో 24 గంటల వర్షం పడకపోతే అమావాస్య పోటు తగ్గి చేలల్లో నీరు బయటకు వెళ్లే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లిపర శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, వీరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నరసాపురం : నీటమునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్ పర్సన్

భీమవరం టౌన్ : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను కూటమి నాయకులతో కలిసి టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ధైర్యంగా ఉండాలని రైతులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రైతు కార్యదర్శి మల్లుల శ్రీధర్, నడింపల్లి శ్రీనివాసరాజు, విజ్జురోతు రాఘవులు, బోడపాటి బాబూరావు పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : భారీ వర్షాలకు మండలంలో 58 హెక్టార్లలో వరి పొలాలు నీటి మునిగాయని మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ముంపునకు గురైన వరి పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. యనమదుర్రులో ఆ గ్రామ రైతు భోగిరెడ్డి కృష్ణమూర్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 3500 ఎకరాల్లో వరినాట్లు వేసినట్లు తెలిపారు. అయితే ముందర నాట్లు వేసిన పొలాలు బాగానే ఉన్నాయని, ఇటీవల నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం నీటి తీవ్రత తగ్గితే ప్రమాదం అంత ఉండదని తెలిపారు.

నరసాపురం : పట్టణంలో వరద ముంపునకు గురైన 2, 3, 4వ వార్డుల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ సోమవారం పర్యటించారు. ఆ ప్రాంతంలో నీటిని వెంటనే మోటార్లతో తోడించాలని సిబ్బందిని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని ఛైర్‌పర్సన్ ఆదేశించారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

భీమవరం కమిషనర్ రామచంద్రారెడ్డి

గురువారం ఉదయం నుండి తొలగింపు ప్రారంభం?

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణానికి ప్రధాన శాపంగా మారిన ఆక్రమణలను గురువారం నుంచి తొలగించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ రామచంద్రారెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. భీమవరంలో సమస్య చాలా జఠిలంగా ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలు, పట్టణ ప్రజల ఫిర్యాదుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా గురువారంలోపు ఆక్రమణలు తీసివేయాలని లేని పక్షంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగిస్తామని ఆయన తెలిపారు. ముందుగా మావుళ్లమ్మ గుడివీధి, ఆదివారం బజార్, బుధవారం మార్కెట్, కొత్త ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ కోరారు. ఈ సమావేశంలో భీమవరం సిటీ ప్లానర్ గౌరు, టిపిఎస్ శాస్త్రి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్టేరు సెంటర్లో రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బేవరేజెష్ యూనియన్ ఆచంట నియోకవర్గ నేతలు మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం విధానం పూర్తిగా ప్రయివేటీకరణ అవుతుందని పలు దినపత్రికలు మీడియా ఛానల్స్, సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయని తెలిపారు. ఐదు సంవత్సరాల నుంచి కష్ట నష్టాలకు ఓర్చి 2019 నుంచి 2022 వరకూ కరోనా సమయంలో కూడా ప్రభుత్వ విధివిధానాలకు కట్టుబడి బాధ్యతలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కష్టపడ్డామని అన్నారు. రాష్ట్రంలో 15 వేల నుండి 18 వేల వరకూ ఉద్యోగులు బేవరేజెస్‌లో పనిచేస్తున్నామని, నూతన ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఆన్‌లైన్ ఫీజు తీసుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో తమను రిక్రూట్మెంట్ చేసుకొని ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి ఏ నాయకునికీ భయపడకుండా ప్రభుత్వ విధి విధానాలకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ద్వారా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. తమను బేవరేజెస్‌లోనే ఉంచుతారా లేక ఔట్‌సోర్సింగ్, కాంటాక్టు బేసిక్ ఉద్యోగాలకు బదిలీ చేస్తారాన్నది ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తెలపాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7వ తేదీన మద్యం షాపుల బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాలో పెనుమంట్ర, పెనుగొండ, పెరవలి మండలాల సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్లు పాల్గొన్నారు.

కమిషనర్‌గా అంజయ్య బాధ్యతలు స్వీకరణ

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా అంజయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పుట్టపర్తి మున్సిపాల్టీ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఆయన రేపల్లె, పెడనలో పని చేశారు. ఒంగోలు, నెల్లూరు, గుంటూరు కార్పొరేషన్లలో కూడా వివిధ విభాగాల్లో పని చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన వెంకటేశ్వర్లు ఒంగోలు కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అంజయ్యకు డిఇ రమేష్, మేనేజర్ నిర్మలకుమారి, నానాజీ, ఎఇలు సునీల్, మణి, ఆర్‌ఒ రామారావు. అరుణకుమారి శుభాకాంక్షలు తెలిపారు.

నేడూ పాఠశాలలకు, అంగన్వాడీలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణలో ఏర్పడిన మార్పులు, రాష్ట్రంలో పరిస్థితుల రీత్యా సెలవును ప్రకటించామని, దీన్ని అమలు చేయని ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

వాడవాడలా సేవా కార్యక్రమాలు



కాళ్లలో మొక్కలు నాటుతున్న నేతలు

ప్రజాశక్తి - ఆచంట

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఆచంట కచేరీ సెంటర్లో సోమవారం జనసేన, టిడిపి కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ భారీ కేక్ కట్‌చేసి పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచంట కచేరీ సెంటర్లో జనసేన ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, ఎంపిటిసి దాసిరెడ్డి పుణ్యవతి, నేతలు గొడవర్తి శ్రీరాములు, జవాది బాలాజీ శ్రీనివాస్, మానేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాళ్ల: డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన మండలాధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో కాళ్లలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు క్లీన్ ఆంధ్రా, గ్రీన్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పెదఅమిరంలో జనసేన స్తూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, ఎంపిటిసి పి.సూర్యకుమారి, ఉప సర్పంచి పి.వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు రాము, ఓగిరాల రాజేష్ పాల్గొన్నారు. ఏలూరుపాడు గ్రామ పంచాయతీలో ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. గ్రామస్తుల సహకారంతో జన సైనికులు ప్రమాదంలో గాయపడిన పెద్దిరెడ్డి పవన్‌కు రూ.49,000 అందజేశారు. గ్రామ ఉపసర్పంచి నల్లగొచ్చు లక్ష్మి నాగార్జున ఆర్థిక సహకారంతో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

గణపవరం : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు కేకులు కట్‌చేసి స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. సిహెచ్ అగ్రహారంలో పంచాయతీ సర్పంచి చుక్కా అప్పారావు కేక్‌కట్ చేశారు.

పెనుమంట్ర : పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని మార్టేరు, పొలమూరు, పెనుమంట్ర, భట్లమగుటూరు తదితర గ్రామాల్లో అభిమానులు, నాయకులు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. మార్టేరులో జనసేన మండలాధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ అధ్యక్షతన ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మార్టేరు జనసేన నాయకులు అడబాల శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో 500 మట్టి గణేష్ విగ్రహ ప్రతిమలు ప్రజలకు అందజేశారు. మార్టేరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన నెల్లి వెంకటేశ్వరరావు కుటుంబానికి అడబాల శ్రీనివాస్ రూ.25 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, మండల సంయుక్త కార్యదర్శి వినుకొండ తేజస్ రామానాయుడు, భావన చందు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరవాసరం : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా దూసనపూడిలో పేదలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. అల్లం రమేష్ వాణి దంపతుల ఆర్థిక సహాయంతో 150 మందికి సుమారు లక్షన్నర రూపాయలతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి యర్రంశెట్టి నాగసాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకివీడు : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక సాలిపేట చేనేత కార్మికుల కమ్యూనిటీ హాల్లో జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాదివాడ సెంటర్లో పార్టీ కార్యాలయం వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల స్వీట్లు పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, ఆప్కాబ్ మాజీ ఉపాధ్యక్షులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైందని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని జన సైనికులతో పాటు టిడిపి, బిజెపి కార్యకర్తలు, నాయకులు ఈ శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పాల్గొని రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించి మాట్లాడారు. శిబిరంలో వైద్యులు, ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు రక్తదానం చేసి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను మండలంలో జన సైనికులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కెపి.పాలెంసౌత్‌లో సర్పంచి అందే వెంకటలక్ష్మి దొరబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకును మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కట్‌చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు. మొగల్తూరులో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కేక్‌కట్ చేశారు. శేరేపాలెంలో జనసైనికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్ఐ వాసు ప్రారంభించారు. మొగల్తూరులో చిరు, పవన్ అభిమానుల మండల అధ్యక్షుడు దాసరి కృష్ణాజీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం చిరంజీవి గ్రంథాలయం వద్ద అభిమానుల ఏర్పాటు చేసిన కేక్‌ను కోపల్లి శ్రీను, ముక్కు పుల్లయ్య కట్ చేశారు. సర్పంచులు ఎం.మాధవి, మాజీ సర్పంచి మేళం బన్ను, అందే రాంబాబు, తంగెళ్ల పెద్దిరాజు పాల్గొన్నారు.

నరసాపురం: సరిపల్లిలో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానుల ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, చాగంటి మురళీకృష్ణ (చిన్నా) సమక్షంలో కేకుకట్ చేసి పేదలకు నిత్యావసర వస్తువులు, చీరలు పంచి పెట్టారు. అనంతరం మాధవ నాయుడు, పవన్ అభిమానులు మొక్కలు నాటారు.

ఉండి : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఉండి మెయిన్ సెంటర్లో మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జన సైనికులు శేషపు మణికంఠ, గొట్టుముక్కల సుబ్బరాజు, పడమటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పెనుగొండ : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పదేళ్లుగా పెనుగొండలో ప్రతి పుట్టినరోజుకూ ఉదయం 4 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు టీ కాఫీ బూస్ట్ హార్లిక్స్ ఉచితంగా అందిస్తున్న లక్ష్మీ టీ స్టాల్ అధినేత పోడూరి భుజంగరావును జనసేన ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కంబాల బాబులు,యర్రంశెట్టి బాబురావు బల్ల చిన్న మరియు జనసేన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడు

వర్ధంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జుత్తిగలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి, నాయకులు గుడిమెట్ల సాయి, మురళీరెడ్డి, కొవ్వూరి చెన్నారెడ్డి పాల్గొన్నారు. పేదల పాలిట దేవుడిగా వైఎస్ఆర్ నిలిచారని జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. మార్టేరు సెంటర్లోని విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అల్లం బుల్లి రెడ్డి, కర్రి వేణుబాబు, బాల సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఆచంట : ప్రజా సంక్షేమం కోసం పరితపించిన నాయకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతిని మండలంలో వాడవాడలా నిర్వహించారు. ఆచంట, తూర్పుపాలెంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.ఆచంటలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, దిరిశాల విజయలక్ష్మి, బుల్లయ్య పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలో వైఎస్ఆర్ వర్ధంతిని అభిమానులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, పడవల సత్యనారాయణ, కుక్కల కృష్ణమోహన్, రేవు రాంబాబు, గుబ్బల నారాయణమూర్తి, సంకు రాము ఉన్నారు.

ఆకివీడు : వైఎస్ఆర్ చిరస్మరణీయుడని మాజీ మంత్రి కనుమూరు బాపిరాజు అన్నారు. రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్, మాదివాడ సెంటర్లో, ఐ.భీమవరంలో కాంగ్రెస్ అభిమానులు, వైఎస్ అభిమానులు వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి బాపిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి జంపన నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి పాల్గొన్నారు.

గణపవరం : వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా వెంకటరాజపురంలో వైసిపి నాయకులు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచి ఎం.సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షులు వినాయక, చీకటిపల్లి మంగరాజు, నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం : స్థానిక వైసిపి కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్టీమర్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహాలకు మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉండి : ఉండి గ్రామ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షుడు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర జానపద సజనాత్మక అకాడమీ మాజీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు మాట్లాడారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు పాల్గొన్నారు.

యుద్ధాలు వద్దు.. శాంతి కావాలి

భీమవరం టౌన్: యుద్ధాలు వద్దు శాంతి కావాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ తెలిపారు. పోకతిప్ప గ్రామంలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనపై దాడులు చేయడం వల్ల అమాయకులైన చిన్న పిల్లలు, మహిళలు 40 వేల మంది చనిపోయారని, లక్షలాది మంది గాయపడ్డారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో శాంతిని నెలకొల్పాలి తెలిపారు. కార్యక్రమంలో తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు లక్ష్మీపతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప్పుటేరు పరిశీలన

కాళ్ల: జెసి ఆదేశాల మేరకు ఏలూరుపాడు గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఉప్పుటేరు పరిస్థితిని ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున సోమవారం పరిశీలించారు. ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద గుర్రపుడెక్క, కిక్కిసను పరిశీలించి, ఆ ప్రాంత రైతులతో మాట్లాడారు.

పోషకాహారంపై అవగాహన

వీరవాసరం: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాయకుదురురు, కొణితివాడ గ్రామాల్లో సోమవారం పోషకాహార ప్రదర్శన, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ లక్ష్మీకాంతం మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాల గురించి వివరించారు. పోషక విలువలు నష్టపోకుండా ఎలా వండుకోవాలనేదానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గడ్డం భారతి భాస్కరరావు, సరోజినీ, ప్రభాకర్, కనకదుర్గ, సత్యవతి, ఆశా వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి విలేకరి వెంకటేశ్వరరావుకు పితృవియోగం

పాలకొల్లు రూరల్: పాలకొల్లు సీనియర్ జర్నలిస్ట్ పోలిశెట్టి తిరుమల వెంకటేశ్వరరావు (పిటి.వెంకటేశ్వరరావు) తండ్రి పోలిశెట్టి అచ్యుత రామయ్య (89) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన 1935లో ములపర్రు వద్ద గల కొటాలపర్రు గ్రామంలో జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఎక్సైజ్ సిఐగా పనిచేస్తూ 1994లో మృతి చెందారు. రెండో కుమారుడు పిటి వెంకటేశ్వరరావు 36 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. మూడో కుమారుడు వ్యాపారం చేస్తున్నాడు. కుమార్తెలకు వివాహమైంది. సేల్స్‌ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో పని చేసిన ఆయన 1994లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ వెంకటేశ్వరరావు కుటుంబానికి ప్రెస్‌క్లబ్ తరపున సానుభూతి తెలిపారు. అచ్యుతరామయ్య భౌతికకాయాన్ని ప్రజాశక్తి నరసాపురం డివిజనల్ ఇన్‌ఛార్జి కటకంశెట్టి బాలాజీ, రిపోర్టర్ గుడాల బాలాజీ, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎంఎన్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, విశాలాంధ్ర విలేకరి పడాల గోపికృష్ణ, విలేకరులు నివాళులర్పించారు. అచ్యుతరామయ్య మృతి పట్ల ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, డెస్క్‌ఇన్‌ఛార్జి వివిఎస్‌వి.ప్రసాద్ సంతాపం తెలిపారు.



అచ్యుత రామయ్య (ఫైల్‌ఫోటో)

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

నరసాపురం: కష్టపడి పని చేసే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో టిడిపి యాప్ ద్వారా ప్రజలకు సమాచారం చేరవేసి ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన పెమ్మాడి శ్రీదేవి, మౌలాలీ, జక్కం వెంకయ్య, జక్కంశెట్టి బాలాజీనికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పొత్తూరి మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఇదే రీతిలో పని చేయాలన్నారు. వార్డు, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కష్టపడాలన్నారు. అనంతరం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, అదికారి అనంత రామారావు, వాతాడి ఉమా, పాపారావు పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డిలో మొక్కలు నాటే కార్యక్రమం

తణుకు: కొండేపాటి సరోజనీదేవి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం వారు గ్రీన్ క్యాంపస్ - క్లీన్ క్యాంపస్ కార్యక్రమంలో మొక్కలు నాటడం, కళాశాల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ లక్ష్మీసుందరీ బాయ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 85 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్యామలాదేవి, సిహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కార్మికులకు రక్షణ కల్పించాల్సింది యాజమాన్యాలే

సిఐటియు

ప్రజాశక్తి - తణుకు

పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ అన్నారు. సోమవారం పట్టణంలో కార్మికుల పని ప్రదేశాల్లో పరిశ్రమల్లో కార్మికులపై జరుగుతున్న ప్రమాదాల పై ప్రజాశక్తి ప్రచురించిన స్పెషల్‌ను కార్మికశాఖ, కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ శ్రమ ద్వారా లాభాలు వస్తున్నప్పటికీ కార్మికులకు రక్షణ కల్పించడం లేదన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం, అధికారుల హడావిడి చేయడం తప్ప ఆచరణలో ఏమీ చిత్తశుద్ధి లేదని అన్నారు. అన్ని పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలుపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌కుమార్, తణుకు సహాయ కార్మిక అధికారి, గార రంగారావు, గుబ్బల గోపీ, ఎస్.ఆదినారాయణబాబు పాల్గొన్నారు.